# మరువలేని మంచితనం

శ్రీనివాస్, శ్రావణి ఆటోలోంచి దిగారు. కళ్యాణమండపం గేటు దగ్గర శ్రీనివాస్ ఆటో డ్రైవర్‌కు డబ్బులిచ్చేసి సూట్‌కేసు పట్టుకుని లోపలికి వెళ్ళబోతూ వుంటే, బావమరిది విశ్వనాథం వచ్చి వాళ్ళిద్దర్నీ చిరునవ్వుతో పలకరించి, శ్రీనివాస్ చేతిలోని సూట్‌కేసు తీసుకుని, వాళ్ళని అనుసరించాడు.

“మీరు నిన్ననే వస్తారని అనుకున్నాం బావా” అన్నాడు విశ్వనాథం.

“మేవూ( అలాగే అనుకున్నామోయ్. కాని నాకు సెలవు దొరకడంలో జాప్యం జరిగింది” అన్నాడు శ్రీనివాస్.

“అదేంకాదులే అన్నయ్యా ! ఈయనకి ఆఫీసు వదిలి రాబుద్ధి పుట్టదు” కిలకిలా నవ్వుతూ అంది శ్రావణి.

ఆమె నవ్వులో నవ్వులు కలిపేశారు వాళ్ళిద్దరూను.

శ్రీనివాస్ అత్తా, మావ(గారు శ్రీనివాస్‌ని, శ్రావణిని పలుకరించారు.

“చివరి గది ఖాళీగా వుంది కదట్రా అబ్బాయ్ అది వీళ్ళకిచ్చేసేయ్” అంటూ కొడుక్కి చెప్పాడు శ్రీనివాస్ మావ(గారు ముకుందరావు.

గదికేసి నడుస్తున్నారు వాళ్ళు ముగ్గురూ. అప్పటికే చాలా మంది వచ్చినట్టున్నారు. హడావిడిగా వుంది హాలు.

రాత్రి పదిగంటలకి పెళ్ళి ముహూర్తం గాబట్టి పెళ్ళి పందిరికి సినిమా స్టయిల్‌లో అలంకరిస్తున్నారు. ఎత్తయిన స్టేజిమీద.

శ్రావణి గదిలోకి అడుగు పెట్టింది, అన్నయ్య వెంట. శ్రీనివాస్ గదిలోపలికి వెళ్తుండగా..

పక్కగదిలోంచి వస్తున్న ప్రసూనను చూసి స్తంభించిపోయాడు శ్రీనివాస్. నిజంగా ఆమె ప్రసూనేనా? అన్న అనుమానం వచ్చి మరో సారి చూశాడు.

ఔను ! ఆమె ప్రసూనే !

ప్రసూన కూడా శ్రీనివాస్‌ని చూసి, అటువంటి అనుభూతిని పొందినట్టుంది. చప్పున గదిలోపలికి వెళ్ళిపోయింది. ఆమె మెదడులో యెన్నో భావాలు చుట్టుముట్టినయ్.

శ్రీనివాస్ మస్తిష్కంలో, గతం గిర్రున తిరిగింది.

" మీరు స్నానాలు ముగించండి బావా ! టిఫినూ కాఫీ తీసుకొస్తాను " అంటూ విశ్వనాథం వెళ్ళిపోయాడు.

ఆ మాటలు, శ్రావణి వింది గాని, శ్రీనివాస్ వినే స్థితిలో లేడు. అతని ఆలోచనలన్నీ ప్రసూన గురించే. ఆలోచనలు గతంలోకి దొర్లాయి. ఆనాటి ప్రసూన అతని వూహాలోకంలో సాక్షాత్కరించింది.

✪ ✪ ✪

శ్రీనివాస్, ప్రసూన కాలేజీలో చదువుకున్న రోజులవి.

ప్రసూన కంటే, శ్రీనివాస్ ఓ సంవత్సరం సీనియర్. అయితేనేం. శ్రీనివాస్‌తో ప్రసూనకి పరిచయమైంది. ఆ పరిచయం క్రమంగా ప్రణయంగా పరిణతి పొందింది. శ్రీనివాస్ మంచి చిత్రకారుడు. రేకా చిత్రాలేగా కుండా, వాష్ డ్రాయింగ్స్, కలర్ పెయింటింగ్స్, కార్టూన్సు వేసేవాడు. అంత చిన్న వయసులో, అటువంటి ప్రజ్ఞగలవాళ్ళు చాలా అరుదేమరి ! అందుకే, ఆ రోజుల్లో శ్రీనివాస్‌ని అతని ఆర్ట్‌ని అభిమానించేవాళ్ళు 'అభినందించే వాళ్ళు, చాలా మంది వుండేవారు. అటువంటి వారిలో ప్రసూన ఒకామె. ఆర్టిస్ట్‌గా శ్రీనివాస్ ని యెంతగా అభినందించేదో, వ్యక్తిగా శ్రీనివాస్‌ని అంతగానే అభిమానించేది.

శ్రీనివాస్ కూడా ప్రసూన అందాన్ని పిచ్చిగా ఆరాధించేవాడు. ఒక్కరోజు కూడా ఆమె అగుపించక పోతే, యేదోలా ఫీలయ్యేవాడు. నిజం చెప్పాలంటే, ప్రసూన రూపురేఖలు,అతను వేసే స్త్రీల బొమ్మల్లో లీలగా అగుపిస్తూ వుండేవి.

అలా, వాళ్ళిద్దరి ప్రణయం పరిఢవిల్లింది.

ఓ రోజు, శ్రీనివాస్‌కి ఓ వింత ఆలోచన వచ్చింది. అటువంటి ఆలోచన వచ్చినందుకు, తనలోతానే సిగ్గుపడ్డాడు. అయినా, మనసులో మెదిలిన కోరికను చంపుకోలేకపోయాడు.

పార్కులో నిర్జనంగా వున్న ఓ మూల బెంచీమీద కూచున్నారు శ్రీనివాస్, ప్రసూనను కొద్దిసేపటి క్రితం కొనుక్కొన్న వేరుశనగ గింజల్ని తింటున్నారు మౌనంగా .

"ప్రసూనా" నిశ్శబ్ద వాతావరణాన్ని భంగపరుస్తూ అన్నాడు శ్రీనివాస్.

"వూఁ..."

"ఇవ్వాళ మనం ఇంత ముభావంగా, మౌనంగా కూచుండిపోయామేవిఁటి"

"అదే నేనూ అనుకుంటున్నాను శ్రీనివాస్"

"ప్రసూనా నువ్వు, నా ఆరాధ్య దేవతవి ఔనా?" ఆర్ధోక్తిలో ఆపేశాడు.

ప్రసూన ముసిముసిగా నవ్వుకుంది.

"ఈ దేవత నుంచి ఓ వరం కోరుకోవాలనుంది... ప్రసాదించుతావా?" మెల్లగా ప్రశ్నించాడు, శ్రీనివాస్.

క్రీగంటితో శ్రీనివాస్ కేసి చూసింది ప్రసూన. అతను యే వరమడుగుతాడో, ఆమె వూహించ గలిగింది. సన్నగా నవ్వింది. మెరుపు తళుక్కుమన్నట్టనిపించిందా నవ్వు.

"ఆ వరమేవిఁటో నాకు తెలుసు చిలిపిగా" అంది.

"నీకు తెలీదు..."

"తెలుసు"

"చెప్పుకో చూద్దాం"

"ఇంకేముంటుంది? ప్రేమికులిద్దరూ కోరుకునేదేవిఁటో అదే" సిగ్గు దొంతరలు ముంచుకు రాగా, మొహం దించుకుంది ప్రసూన.

నవ్వేడు, శ్రీనివాస్.

"నువ్వూహించింది తప్పు ప్రసూనా"

" మరింకేవిఁటి?"

" సామాన్య ప్రేమికుడిగానే నన్నర్థం చేసుకున్నావు గాని, నా కళా హృదయపు లోతుల్ని గ్రహించలేకపోయావు"

ప్రసూన కేవీఁ బోధపడలేదు.

" అబ్బ ! సస్పెన్సుతో చంపకు మరి చెప్పు"

మారాం చేస్తున్నట్టుగా అంది.

"నువ్వు కోపగించుకోవు గదా?" సూటిగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ ప్రశ్నించాడు శ్రీనివాస్.

"కోపమెందుకూ?"

"అలాగని ఒట్టు వెయ్యి?"

"సరే ! కోపగించుకోను..." అంటూ విసుగ్గా అతని చేతనిలో చెయ్యి వేసింది.

కాస్తంత తటపటాయించిన తర్వాత, ఆమె కింకా దగ్గరగా జరిగి

"నీ నగ్న చిత్రాన్ని గీయాలని వుంది ప్రసూనా అది నాలోని కళాకారుడి కోరిక..." మెల్లగా రహస్యం చెప్తున్నట్టుగానే అన్నాడు శ్రీనివాస్

"ఛీ ! ఛీ!! ఏం వెధవ కోరిక?" మొహం పక్కకి తిప్పుకుంది ప్రసూన.

"అదిగో కోపం వచ్చేసింది ! వాగ్దానం మర్చావు" అన్నాడు శ్రీనివాస్.

"అయినా యిదేం కోరిక? ఎవరైనా వింటే నవ్వుతారు"

"నేను చిత్రకారుణ్ణి. చిత్రకారుడి కోరికలు వింతగానే వుంటాయి ప్రసూనా ! నీకు అభ్యంతరమైతే అంగీకరించొద్దు. నామీద నమ్మకం లేకపోయినా అంగీకరించకు" అన్నాడు నిరుత్సాహంగా.

ప్రసూన ఆలోచనల్లో పడింది. శ్రీనివాస్‌కి తానెప్పుడో మనస్సంకితం చేసింది. అతనూ, తనని పిచ్చిగా ఆరాధిస్తున్నాడు. అసభ్యంగా యే ఒక్కనాడూ ప్రవర్తించలేదు.

ప్రేమికుల మధ్య అభ్యంతరాలేముంటాయని ? చిత్రకారుడిగా ఆ కోరిక కోరాడు. అది చిలిపితనమూ కాదు. దుర్బుద్ధితో కూడినదీ కాదు. కళాకారుడి కోరిక ! ప్రేయసిగా తాను ఆ మాత్రం త్యాగం చెయ్యలేదా ! ఎలాగూ తామిద్దరం పెళ్ళిచేసుకోబోతున్నాం...

"ఇక బైలుదేరదామా" అంటూ లేచింది ప్రసూన,

"సరేం పదపోదాం" తనూ లేచాడు శ్రీనివాస్.

"మరి నా అభ్యర్థన విషయం యేంచేశావు" మెల్లగా అడిగాడు.

ఇద్దరూ నడుస్తున్నారు. జనం పలచబడ్డారు.

"పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యనని హామీ ఇస్తేనే, నీ అభ్యర్థనని పరిశీలిస్తాను..." సన్నగా నవ్వుతూ అంది ప్రసూన.

"హామీ ఇస్తున్నాను ప్రసూన! నన్నింకా నువ్వు అర్థం చేసుకోలేకపోతున్నావా !"

"అయితే రేపు సాయంత్రం ఆరింటికి నీ రూమ్‌కి వస్తాను" అంది మెల్లగా, అతని మొహంలోకి చిలిపిగా చూస్తూనే,

శ్రీనివాస్ మొహం విప్పారింది. అతని కళ్ళలో కొత్త కాంతి మెరిసింది. తాను ఎన్నో రోజుల్నించి కలలు కంటోన్న కోరిక నిజం కాబోతున్నందుకు అతని హృయం నృత్యం చేసింది.

"థాంక్స్ ప్రసూనా! నా జన్మ తరించినట్టే భావిస్తాను" మురిసిపోతూ అన్నాడు శ్రీనివాస్.

ప్రసూన ముసిముసిగా నవ్వుకుంది.

కాస్తంత దూరం వెళ్ళాక, ఇద్దరూ విడిపోయారు.

✪ ✪ ✪

మర్నాడు, అనుకున్న వేళకి, ప్రసూన శ్రీనివాస్ గదికి వచ్చింది.

శ్రీనివాస్ అప్పటికే డ్రాయింగు బోర్డుతో సహా సరంజామా అంతా సిద్ధం చేశాడు.

ప్రసూన లోపలికి రాగానే తలుపు గడియవేశాడు.

ఆమె యెక్కడో నిల్చోవాలో, యే అభినయంలో నిల్చోవాలో చెప్పాడు శ్రీనివాస్.

ప్రసూన రావడమైతే వచ్చింది గాని, ఆమెలో పిరికితనం క్రమంగా పాకురుతున్నట్టు ఫీలయింది. కాళ్ళు అప్రయత్నంగా వణికినయ్. అయితేనేం - బలవంతంగా తమాయించుకుంది. 'తన ప్రియుడి అభ్యర్థన మన్నించాలి' అన్న పట్టుదల పెరిగి, పిరికితనాన్ని ఆమెలో పటాపంచాలు చేసింది.

"ఇదిగో, నువ్వు మాత్రం నా దగ్గరికి రాకూడదు, తెలుసా?" ఆంక్ష విధించింది.

"అలాగే"

ప్రసూన తాను ధరించిన చీర, జాకెట్టు.. అన్నీ. ఒక్కక్కటే తీసేసి, నగ్నంగా నిల్చుంది. అదో కొత్త అనుభవం ఆమెకి !

శ్రీనివాస్ కళ్ళు చెదిరిపోయాయ్, హృదయ స్పందన అధికమయింది. బంగారు బొమ్మే తన యెదుట నుంచున్నట్టుగా ఫీలయ్యాడు. ఆమె వంపులు, వంపుల్లోని సొంపులు, అతణ్ణి మత్తెక్కిస్తున్నాయ్. పిచ్చివాణ్ణి చేస్తున్నయ్. అయినా, ప్రసూన హెచ్చరిక గుర్తు పెట్టుకుని, నిగ్రహించుకున్నాడు.

చప్పున పెన్సిలు తీసుకున్నాడు. స్కెచ్ గీశాడు, శ్రీనివాస్.

"అబ్బ! కాళ్ళు నొప్పెడుతున్నాయి బాబూ" అంది ప్రసూన.

"మరి కాస్సేపే! ప్లీజ్ !" అంటూ బ్రష్‌తో రంగులు పులిమాడు.

"థాంక్స్ ప్రసూనా" అంటూ ముందుకు రాబోయాడు, శ్రీనివాస్.

"అదిగో! రావద్దన్నానా? మాటంటే మాటే" అంటూ గబ గబ దుస్తులు ధరించేసింది ప్రసూన.

డ్రాయింగ్ బోర్డుకి దగ్గరగా వచ్చి, తన చిత్రాన్ని చూసుకుంది. ప్రసూన, అద్భుతంగా వచ్చింది బొమ్మ. నగ్నంగా స్త్రీమూర్తి యెంత అద్భుతంగా, అందంగా, ఆకర్షణీయంగా వుంటుందో, అప్పుడు గ్రహించిందామె. అందుకేనేమో, మగాళ్ళంతా స్త్రీల నగ్న చిత్రాల కోసం యెగబ్రాకుతూ వుంటారు... అనుకుంది.

"ఎలావుంది ప్రసూనా?" సగర్వంగా ప్రశ్నించాడు శ్రీనివాస్.

"అద్భుతంగా వుంది శ్రీనివాస్! అయితే ఇప్పుడు దీన్ని యేం జేస్తావు?"

" దీన్ని నా దగ్గరే పదిలంగా వుంచుకుంటాను ప్రసూనా? చిత్రకారుడిగా యీ చిత్రం నాకెంతో తృప్తి నిస్తుంది." అన్నాడు తృప్తిగా.

"సరే! నేనిక వెళ్ళిరానా?"

"ఇంతసేపూ నీకు శ్రమ కలిగించాను. కనీసం కాఫీ అయినా ఇచ్చుకోపోతే, నీవు నాకు శాపనార్థాలు పెట్టవూ? పద - అలా కాఫీ హోటల్‌కి పోయి, కాస్తంత టిఫిను తిని, కాఫీ తీసుకుందాం" అంటూ గదికి తాళం వేసి, కాఫీ హోటలు కేసి నడిచాడు, శ్రీనివాస్, ప్రసూనతో పాటు.

రోజులు గడుస్తున్నాయ్.

గాఢంగా ప్రేమించుకున్న శ్రీనివాస్, ప్రసూనలు దంపతులు కాలేకపోయారు.

ప్రసూన యెంత మొత్తుకున్నా, మొరపెట్టినా ఆమె తల్లిదండ్రులు, ఆమె వివాహం శ్రీనివాస్‌తో చెయ్యడానికి అంగీకరించలేదు. ఓ డాక్టరుకిచ్చి పెళ్ళి చేశారు.

✪ ✪ ✪

అంతే! మళ్ళీ శ్రీనివాస ఆమెను చూడ్డం ఇప్పుడే.

శ్రీనివాస్ యిరకాటంలో పడ్డాడు. ప్రసూనని పలుకరించడానికయినా ప్రయత్నించలేదు. ప్రసూన కూడా శ్రీనివాస్ తనకి పరిచయమున్న వ్యక్తి కానట్టే ప్రవర్తిస్తోంది.

ఆ రోజు మధ్యాహ్నం విశ్వనాథం, ప్రసూనని డాక్టర్ శేఖరంని తీసుకొచ్చి, చెల్లెలికి, బావకి పరిచయం చేశాడు.

అప్పుడూ అపరిచితుల్లా పరిచయమయ్యారు. అయితేనేం - శ్రీనివాస్‌కి, ప్రసూనకి లోలోపల భయంగానే వుంది. తమ పూర్వం పరిచయం గురించి యెవరికయినా తెలుస్తుందేమోనని, అందుకే ఒకర్నొకరు తప్పించుకు తిరుగుతున్నారు. ఎవరి మనసులో బాధ వారికి లేకపోలేదు.

పెళ్ళి సందడిలో అందరూ హడావిడిగానే ఉన్నారు. డాక్టర్ శేఖరం బైటకి వెళ్ళాడు. శ్రావణి పెళ్ళి కూతురు దగ్గరుంది.

శ్రీనివాస్ ఒంటరిగా గదిలో కూచుని న్యూస్ పేపరు చదువుకుంటున్నాడు.

ప్రసూన వచ్చింది హడావిడిగా,

"శ్రావణి లేదాండీ ? " అంది

"లేదండి..."

" మీరు కులాసాగా వున్నారా " ఆప్యాయంగా అడిగింది.

" ఆ..... కులాసాయే నువ్వు ఆనందంగా వున్నావనుకుంటాను"

" మనం ఒకటికాలేకపోయామన్న విచారం తప్పించి, ఇతరత్రా ఆనందగానే వున్నాను"

" మనం ఒకటి కాలేకపోయాం. మన దురదృష్టం... దేవుడు కరుణించలేదు. కాని మనల్ని మానసికంగా దూరం చెయ్యలేని అనుభూతులు చిరకాల స్మృతులు మిగిపోయాయి " అన్నాడు శ్రీనివాస్. అతని అభిప్రాయాన్ని ఆమె గ్రహించింది.

" అది నిజమేలెండి ! కాని ఆనాటి మీ మంచితనాన్ని మానవత్వాన్ని ఇప్పటికీ మర్చిపోలేను. ఇప్పుడే కాదు - యెన్నటికీ మర్చిపోలేను శ్రీనివాస్ గారూ ! వస్తా" అంటూ మెరుపులా నిష్క్రమించింది ప్రసూన,

ఆమె కళ్ళల్లో నీరు చిప్పిల్లడం గమనించాడు శ్రీనివాస్.

బరువుగా ఓ నిట్టూర్పు విడిచాడు. ప్రసూన అన్నమాటల్లో నిజం లేకపోలేదనుకున్నాడు. ఔను ! ఆమె నగ్నంగా తన యెదుట నిల్చుని వున్నా మాటకి కట్టుబడి, మానవత్వాన్ని మర్చిపోలేదు. బహుశా అటువంటి నిగ్రహం ఆ తరుణంలో మరెవ్వరికీ సాధ్యపడేది కాదేమో ! ప్రసూన నుండి తనకి లభించిన సర్టిఫికెట్ అది ! అంతకంటే యేం కావాలి ? ఆ సర్టిఫికెట్ ముందు తాను పదిలంగా దాచుకున్న ఆమె నగ్న చిత్రం కూడా బలాదూరే !... అనుకున్నాడు న్యూస్ పేపరు చదవడంలో మళ్ళీ నిమగ్నమౌతూ.

(స్వాతి వారపత్రిక 29-11-85)

□□□